# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆకాంక్షించారు.
- ఖనిజాలను వెలికి తీయడం ద్వారా ఆదాయ మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.
- విద్యార్థులు ఉద్యోగాలను సృష్టించే స్థాయికి చేరుకోవాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు.
- ప్రతీ నియోజకవర్గంలోనూ ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్ లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి టి.జి. భరత్ వెల్లడించారు.

========================

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆకాంక్షించారు. విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గిరిజన వర్సిటీ విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థులలో ఆత్మ విశ్వాసం పెంపొందించే కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం నిలుస్తోందని తెలిపారు. పుస్తక జ్ఞానంతో పాటు వ్యవహార జ్ఞానం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సంస్కృతి పరిరక్షణతో పాటు సమాజ, దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి అన్నారు. పతకాలు అందుకునేవారిలో 40 శాతం మహిళలు ఉండడం గొప్ప విషయమని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. స్వర్ణ పతకం సాధించిన వారిలో 70 శాతం మహిళలు ఉండడం గర్వకారణమని రాష్ట్రపతి తెలియచేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

========================

విద్యార్థులు ఉద్యోగార్థులుగా ఉండరాదని.. ఉద్యోగాలను సృష్టించే స్థాయికి చేరుకోవాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు. విశాఖలో గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2047 వికసిత్ భారత్ లక్ష్యం కోసం విద్యార్థులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సూచించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు ముందుకు సాగాలని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో విలువైన ఖనిజ నిల్వలను గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని ఆయన సూచించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై సమీక్షను ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని.. మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలు ఇచ్చారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులు  పాల్గొన్నారు.

========================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జాబితా మ్యాపింగ్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలోని వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామంలో ఆయన ఈరోజు పర్యటించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా సర్వేలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాకు మ్యాపింగ్ చేస్తున్నామన్నారు.

విరామం

========================

రాష్ట్రంలో గత రెండేళ్ళ కాలంలో 20 లక్షల కోట్ల రూపాయల వరకూ పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... రెండేళ్లలో 18 వరకూ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (SIPB) సమావేశాలు నిర్వహించామని తెలిపారు. క్వాంటాం వ్యాలీ, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, స్టీల్ ప్లాంట్ వంటి మూడు సెక్టర్లపై రాష్ట్ర ప్రభుత్వం  ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. అదే విధంగా సర్క్యులర్ ఎకానమీ పాలసీని రాష్ట్రంలో తీసుకువచ్చామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలోనూ MSME పార్క్ లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

డంపింగ్ యార్డ్ రహిత మునిసిపాలిటీల దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మునిసిపాలిటీల్లో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే చెత్తను అదే రోజు పూర్తిగా తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇప్పటికే విశాఖ, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు పలు మునిసిపాలిటీల చెత్త తరలింపు ప్రక్రియ జరిగిందని అధికారులు మంత్రికి తెలిపారు. మిగిలిన మునిసిపాలిటీల్లోని చెత్తను ప్రాసెస్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసే ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటు పనుల పురోగతిపైనా మంత్రి అధికారులతో చర్చించారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపటి నుండి వరుసగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఆయన పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా పర్యటనల్లో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నారు. “పేదల సేవలో” కార్యక్రమంలో భాగంగా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో రేపు పర్యటించనున్నారు. అదే రోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీ సిటీలో హీరో మోటో కార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ కి శంకుస్థాపన చేయనున్నారు. 2వ తేదీ ఉదయం తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో “వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్” (VBG-RAM-G) ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. 3వ తేదీ ఉదయం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. 3 తేదీ నుంచి 5 వతేదీ వరకు ముఖ్యమంత్రి కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

========================

ఉత్తర బంగాళాఖాతం దానిని ఆనుకుని దక్షిణ బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. జులై 3వ తేదీ నాటికి వాయువ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. రాగల మూడు రోజులలో రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

========================

ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరును మరింత మెరుగుపరచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఈరోజు ఆదేశించారు. ఈ లక్ష్య సాధనకు సహకరించే 8 ప్రధానాంశాలపై దాదాపు 3 గంటల పాటు సంబంధిత అధికారులందరితో మంత్రి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది జవాబుదారీతనాన్ని మరింతగా పెంచాలని, ఇందుకోసం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మదింపు ప్రక్రియను సమగ్రంగా మార్చాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు.

========================
========================